ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
సోమవారం 20 జనవరి 2025



హొగెనేకల్‌లో పర్యాటకుల సందడి

● దోనెల సవారీకి పోటాపోటీ




హొగెనేకల్ జలపాతంలో దోనెల సవారీ చేస్తున్న పర్యాటకులు

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతం హొగెనేకల్‌లో ఆదివారం రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల నుంచి కూడా భారీగా పర్యాటకులు వచ్చారు. ప్రస్తుతం హొగెనేకల్ జలపాతానికి నీరు వస్తుండటంతో ఆ ప్రాంతంలో దోనెలపై సవారీ చేయడానికి పర్యాటకులు బారులుతీరారు. పలుచోట్ల దోనెల కోసం గంటకు పైగా పర్యాటకులు వేచి ఉండాల్సి వచ్చింది. కర్ణాటకలోని జలాశయాల పరీవాహక ప్రాంతాల్లో ప్రస్తుతం భారీగా వర్షాలు కురుస్తుండటంతో హొగెనేకల్ జలపాతంలోకి అదనపు జలాలు ప్రవేశిస్తున్నాయి. దీనికి తోడు జలపాతం వద్ద తేలికపాటి వానజల్లులు పడుతుండటంతో వాతావరణం మరింత చల్లబడింది. సేలం, ధర్మపురి, కృష్ణగిరి తదితర జిల్లాల నుండి కూడా వందల సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో మొసళ్ల పార్కు, చిల్డ్రన్స్ పార్క్ తదితర ప్రాంతాల్లో పర్యాటకుల సందడి అధికమైంది. వాకింగ్ ట్రాక్, బస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో కూడా పర్యాటకుల రద్దీ అధికమైంది.

ఇంటిలో చొరబడిన ఏనుగు

● గూండలూరులో ఉద్రిక్తత
● బెంబేలెత్తిన ఉత్తరాది కార్మికులు



ఇంటిలోకి ప్రవేశించి గ్యాస్ సిలిండర్‌ను లాగేస్తున్న అడవి ఏనుగు

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కోవై జిల్లా గూడలూరు నగర పంచాయతీలోని తెక్కుపాళయం కెనడీ అవెన్యూ ప్రాంతంలో నలుగురు ఉత్తరాది కార్మికులుంటున్న ఇంటిలోకి చొరబడిన ఏనుగు నానాబీభత్సం సృష్టించింది. శనివారం అర్ధరాత్రి ఇంటి గుమ్మంలోకి తల దూర్చిన ఏనుగు... అందిన వస్తువులన్నింటినీ ధ్వంసం చేసింది. ఆ సమయంలో ఆ గదిలో ఉత్తరాదికి చెందిన నలుగురు కార్మికులు గాఢ నిద్రలో వున్నారు. ఒక్కసారిగా పెద్ద ఎత్తున శబ్దం వినిపించడంతో ఉలిక్కిపడిన కార్మికులు.. చీకట్లో పెద్ద ఆకారం తమ గదిలోకి ప్రవేశించిందని గ్రహించి భయాందోళనలకు గురయ్యారు. ఆ ఏనుగు అల్మారాలోని డబ్బాలను కిందపడేసి పచ్చి బియ్యాన్ని ఆరగించింది. ఆ తర్వాత ఆ ఏనుగు అక్కడి నుండి కాస్త దూరం వెళ్ళి మళ్లీ తిరిగొచ్చి ఇంటిలోకి దూరేందుకు ప్రయత్నించింది. గ్యాస్ సిలిండర్‌ను లాగి పడేసింది. ఓ సంచిలోని పచ్చి బియ్యాన్ని ఆరగించింది. ఆ తర్వాత అక్కడి నుంచి పరుగెత్తుకుంటూ వెళ్ళింది. ఈ సంఘటనపై ఉత్తరాది కార్మికులు అటవీశాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అటవీశాఖ సిబ్బంది ఆ ఏనుగు కోసం గాలిస్తున్నారు.

ఇండియా కూటమిలోకి రండి

● విజయ్‌కి సెల్వపెరుంతగై ఆహ్వానం

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమిలోకి తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ రావాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుంతగై పిలుపునిచ్చారు. రాజా అన్నామలై పురంలో శనివారం మాజీకేంద్రమంత్రి వాళప్పాడి రామ్మూర్తి 86వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సెల్వపెరుందగై మీడియాతో మాట్లాడుతూ, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ తదితర మతవాద పార్టీలకు వ్యతిరేకంగా ఏర్పడిన ఇండియా కూటమిని బలపరచేందుకు విజయ్ సహా ప్రాంతీయ పార్టీలు కూడా కూటమిలో చేరాలని కోరారు. సోమవారం నుండి ఈరోడ్ తూర్పు నియోజకవర్గంలో డీఎంకే అభ్యర్థికి మద్దత్తుగా కాంగ్రెస్ ప్రచార కమిటీతో కలిసి ప్రచారం చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ విజయ్ వసంత్ సహా కాంగ్రెస్ ప్రముఖులు పాల్గొన్నారు.

నగరంలో రోడ్లు జలమయం

కుండపోత

చెన్నైలో వర్షం దృశ్యాలు





ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం, శివారు ప్రాంతాల్లో శనివారం అర్ధరాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. శివారులో ఏకధాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రధాన రోడ్లలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. పొంగల్ పండుగ అనంతరం బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావం రాష్ట్రంపై పడింది. దీంతో తిరువళ్లూరు, రామనాథపురం, పుదుకోట, తంజావూర్, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాలు సహా పలుప్రాంతాల్లో ఓ మోస్తరు నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇదిలా ఉండగా , నైరుతి బంగాళాఖాతం - శ్రీలంక తూర్పు తీరం మీదుగా తాజాగా ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, సుమారు 2.5 కిలోమీటర్ల మేర విస్తరించి, మరింత విస్తరించడానికి వాతావరణ అనుకూలంగా ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆవర్తన ప్రభావంతో చెన్నై సహా పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడ్డాయి. కాగా, దక్షిణ తమిళనాడు తీరప్రాంతాల మత్స్యకారులు వాతావరణం పరిస్థితి చక్కబడే వరకు సముద్రంలోకి వెళ్లవద్దని సూచించింది. నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి 7 గంటలకు చిరు జల్లులతో మొదలైన వర్షం, అర్ధరాత్రి తర్వాత ఈదురు గాలులతో కురిసింది. ఉత్తర చెన్నై, దక్షిణ చెన్నైలోని పలు సబ్‌వేలలో భారీగా వర్షంనీరునిలిచింది. మీనంబాక్కంలో గరిష్ఠంగా 4.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పుళల్ రిజర్వాయర్‌లో నీరు పెరుగుతోందని ప్రజా పనుల శాఖ అధికారులు తెలిపారు.



స్టాలిన్ చేతుల మీదుగా డీఎంకే సభ్యత్వం స్వీకరిస్తున్న దివ్య

పథకాలు నచ్చటం వల్లే చేరా

డీఎంకేలోకి నటుడు సత్యరాజ్ కుమార్తె దివ్య

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు సత్యరాజ్ కుమార్తె దివ్య ఎట్టకేలకు రాజకీయాల్లోకి ప్రవేశించారు. డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో ఆ పార్టీ సభ్యత్వం స్వీకరించారు. వృత్తిరీత్యా డైటీషియన్ అయిన దివ్య ప్రతి ఎన్నికల సమయంలో యువతను ఉత్తేజ పరిచేలా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్‌పేజీలో వ్యాఖ్యానాలు చేస్తుంటారు. 2024లో లోక్‌సభ ఎన్నికల సందర్భంలో తనకు రాజకీయాలపై ఆసక్తి ఉందని, వీఐనంత త్వరగా ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరుతానని ప్రకటన చేశారు. తమ పార్టీలో చేరాలంటూ వివిధ పార్టీల నుంచి తనకు ఆహ్వానాలు వస్తున్నాయని, అందులో మతతత్వ పార్టీ కూడా ఉందని, అందులో చేరటం తనకిష్టం లేదని కూడా పేర్కొన్నారు. ఈ ప్రకటనలతో దివ్య త్వరలో ఏదో ఒక రాజకీయపార్టీలో చేరటం ఖాయమని అందరూ భావించారు. చివరకు ఆదివారం ఉదయం డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలిసి పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఆ సందర్భంగా డీఎంకే కోశాధికారి టీఆర్‌బాలు, మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్ బాబు తదితరులు దివ్యా సత్యరాజ్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానంతరం అరివాలయం వెలుపల ఆమె మీడియాతో మాట్లాడుతూ... గత మూడేళ్లుగా డీఎంకే ప్రభుత్వం మహిళాభ్యుదయానికి పలు సంక్షేమపథకాలు అమలు చేసిందని, దీంతో మహిళల్లో ఆర్థిక స్థోమత పెరిగిందన్నారు. పలు పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని, అందుకే తాను డీఎంకే సభ్యత్వం స్వీకరించానని , డీఎంకేలో చేరడం తనకెంతో గర్వకారణంగా ఉందని దివ్యా సత్యరాజ్ పేర్కొన్నారు.

తిరుచెందూరులో వైభవంగా వరుషాభిషేకం

● పోటెత్తిన భక్తజనం



తిరుచెందూరు గర్భాలయ విమానంపై కలశాలకు అభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు, ప్రధానార్చకులు

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి మూలవిరాట్టు ప్రతిష్ఠించిన రోజైన ఆదివారం ఉదయం తై ఉత్తిర వరుషాభిషేకం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా 3 గంటలకే ఆలయాన్ని తెరచి, 3.30 గంటలకు విశ్వరూప దర్శనం, 5 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, 8.15 గంటలకు దేవతామూర్తులకు, విమాన గోపురంపై కలశాభిషేకం నిర్వహించారు. 10 గంటలకు ఉచ్చి కాలాభిషేకం, సాయంత్రం 4 గంటలకు సంధ్యాభిషేకం, దీపారాధన, రాత్రి ఏడు గంటలకు పుష్పాంజలి కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం కుమారవిటంగ పెరుమాళ్‌స్వామి, దైవానై అమ్మవారు వేర్వేరుగా స్వర్ణమయూర వాహనాల్లో ఊరేగారు.

పోటెత్తిన భక్తులు..

ఆదివారం, శుభముహూర్త దినం, వరుషాభిషేకం వేడుకలు జరగటంతో తిరుచెందూరు ఆలయానికి దేశ విదేశాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వేలాదిమంది భక్తులు సముద్రతీరంలో స్నానమాచరించి, నాళికినరులోని పవిత్రజలాలను శిరస్సులపై చల్లుకుని స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. వరుషాభిషేకాన్ని పురస్కరించుకుని సమీప జిల్లాల నుండి భక్తులు కావళ్ల మోస్తూ, వంటికి, నోటికి శూలాలు గుచ్చుకుని పసుపు వస్త్రాలు ధరించి, క్షీర కలశాలను మోస్తూ పాదయాత్రగా విచ్చేసి స్వామివారిని దర్శించారు. శుభముహూర్తదినం కావటంతో ఆలయ ప్రాంగణంలో పలుచోట్ల వివాహవేడుకలు కూడా జరిగాయి. ఒకే సమయంలో 30కి పైగా పెళ్ళిళ్ల జరుగటంతో ఆలయ ప్రాంగణం నలువైపులా మంగళ వాయిద్యాలతో మార్మోగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు, అధికారులు, పోలీసులు తగు సదుపాయాలు కల్పించారు. ఆలయ ప్రాంగణం వద్ద దేవస్థానం అధికారులు భక్తులకు రోజంతా అన్నదానం ఏర్పాటు చేశారు.



ఆలయ ప్రాంగణంలో భక్తజనసందోహం

మహానాడు తర్వాత జనం ముందుకు

● నేడు పరందూరువాసులతో విజయ్ భేటీ



చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) నాయకుడు, ప్రముఖ సినీనటుడు విజయ్ రాజకీయ పార్టీని ప్రారంభించి విక్రవాండిలో మహానాడును నిర్వహించిన తర్వాత తొలిసారిగా జనం ముందుకు రానున్నారు. కాంచీపురం సమీపం పరందూరు వద్ద రెండో విమానాశ్రయ ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్న పరందూరు, ఏకనాపురం సహా 13 గ్రామాల ప్రజలతో సోమవారం సమావేశం కానున్నారు. కాంచీపురం జిల్లా పరందూరు వద్ద రెండో విమానాశ్రయం నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. దీంతో పొలాలు, నివాసాలను కోల్పోనున్న పరందూరు, ఏకనాపురం సహా 13 గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు వివిధ రకాలుగా 900 రోజులుగా ఆందోళనలన కొనసాగిస్తున్నారు. దీంతో పరందూరు గ్రామంలోకి ఇతరులెవరూ ప్రవేశించకుండా పోలీసులు కట్టుదిట్టంచేశారు. ఈ పరిస్థితులలో టీవీకే నేత విజయ్ విమానాశ్రయ ప్రాజెక్టులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న 13 గ్రామాల ప్రజలను కలుసుకునేందుకు సిద్ధమయ్యారు. విజయ్ పర్యటనకు పోలీసుల అనుమతి కూడా లభించింది. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు ఆయన బయలుదేరి 11 గంటలకు ఏకనాపురం చేరుకుంటారు. క్యారవ్యాన్‌పై నుండే ఆయన విమానాశ్రయ వ్యతిరేకోద్యమ సభ్యులతో, 13 గ్రామాల రైతులతో మాట్లాడనున్నారు. విజయ్ పర్యటన నేపథ్యంలో ఏకనాపురం, పరందూరు గ్రామాల వద్ద పోలీసు బలగాలను మరింతగా పెంచారు. టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ఇతర నాయకులంతా కలిసి విజయ్ పర్యటనకు అవసరమైన సదుపాయాలను కల్పించడంలో తలమునకలయ్యారు.

అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకోం

మెగా కూటమితో బరిలోకి దిగుతాం ● బీజేపీ నేత అన్నామలై



మదురై ఆలయం వద్ద శిశువుకు నామకరణం చేస్తున్న అన్నామలై

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకునే అవకాశం లేదని, భావసారూప్యత కలిగిన పార్టీలతో మెగా కూటమి ఏర్పాటు చేసుకుని బరిలోకి దిగుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రకటించారు. మదురైలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తన వల్లే అన్నాడీఎంకే కూటమి నుంచి వైదొలగినట్లు ఆరోపణలు చేయడం గర్హనీయమన్నారు. మైనారిటీవర్గాల ఓట్లను టార్గెట్‌గా చేసుకుని గత శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఒంటరిగా పోటీ చేసి చిత్తుగా ఓడి పోయిందన్నారు. డీఎంకే ప్రభుత్వంపై ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారని, సీఎం స్టాలిన్ మదురైలో పర్యటిస్తే ఈ విషయం తెలుస్తుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే అధికారంలోకి వస్తే దేవాదాయ శాఖ ఉండదని అన్నామలై చెప్పారు. ఈరోడ్ ఈస్ట్ ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలవటం వల్ల ప్రతిపక్షాలకు ఒరిగేదేమీ లేదన్నారు. పరిపాలనలో తప్పులు బయటపడకుండా ఉండేందుకే ముఖ్యమంత్రి స్టాలిన్ గవర్నర్‌పై పసలేని ఆరోపణలు చేస్తున్నారని అన్నామలై ఎద్దేవా చేశారు.

ఈరోడ్‌లో ఇండిపెండెంట్‌గా అన్నాడీఎంకే నేత

● పార్టీ నుండి బహిష్కరించిన ఈపీఎస్

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గంలో తమ మాటను కాదని స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన నేతపై అన్నాడీఎంకే అధిష్టానం వేటు వేసింది. పార్టీ నియమావళిని ఉల్లంఘించినందున సెంథిల్ మురుగన్‌ను పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆదివారం ప్రకటించారు. శనివారం జరిగిన నామినేషన్ల పరిశీలన అనంతరం డీఎంకే అభ్యర్థి చంద్రకుమార్, నామ్ తమిళర్‌కట్చి అభ్యర్థి సీతాలక్ష్మి సహా 55 మంది బరిలో మిగిలారు. సోమవారం నామినేషన్ల ఉప సంహరణ గడువు ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇండిపెండెంట్లుగా నామినేషన్లు వేసిన వారిలో ఈరోడ్ మహానగర జిల్లా అన్నాడీఎంకే ఎంజీఆర్ యువజన విభాగం డిప్యూటీ కార్యదర్శి సెంథిల్ మురుగన్ కూడా ఉన్నాడని తెలియగానే ఈపీఎస్ సహా సీనియర్ నేతలు దిగ్భ్రాంతి చెందారు. ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికలను అన్నాడీఎంకే, డీఎండీకే, బీజేపీ పార్టీలు బహిష్కరించిన విషయం తెలిసింది. అన్నాడీఎంకే ఈ ఉప ఎన్నికలను బహిష్కరించిన నేపథ్యంలో సెంథిల్ మురుగన్ ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేయడం పట్ల ఈపీఎస్ ఆగ్రహించి పార్టీ నుండి బహిష్కరిస్తూ ప్రకటన జారీ చేశారు.

ఎవరీ సెంథిల్ మురుగన్?



అన్నాడీఎంకే రెండు ముక్కలైనప్పుడు మాజీ సీఎం ఒ.పన్నీర్‌సెల్వం వర్గంలో ఉండేవారు. 2023లో ఓపీఎస్ వర్గం తరఫున ఈరోడ్ ఈస్ట్ నుంచి నామినేషన్ వేశారు. రెండాకుల గుర్తుపై వివాదం చెలరేగటంతో పోటీ నుంచి ఉపసంహరించుకున్నారు. ఆ తర్వాత కొద్ది రోజులకే ఆయన ఈపీఎస్ సమక్షంలో అన్నాడీఎంకేలో చేరి ఈరోడ్ జిల్లా అన్నాడీఎంకే ఎంజీఆర్ యువజన విభాగం డిప్యూటీ కార్యదర్శిగా నియమితులయ్యారు. ప్రస్తుతం పార్టీ నిర్ణయాన్ని కాదని ఇండిపెండెంట్‌గా పోటీ చేయడంపై సెంథిల్ మాట్లాడుతూ.. ఈరోడ్ ప్రజల ప్రధాన సమస్యలేమిటో తనకు బాగా తెలుసని, స్థానికుల నుంచి తనకు మద్దతుందని, అందుకే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నానని, ఈ విషయంలో పార్టీ తనపై కఠిన చర్యలు తీసుకున్నా పట్టించుకోనని ప్రకటించారు.

తిరుప్పరంకుండ్రంపై జంతు బలులకు యత్నం

● పోలీసుల అభ్యంతరం



తిరుప్పరంకుండ్రం కొండపై సికిందర్ పాదుషా దర్గా వద్ద బలి ఇవ్వడానికి మేకపిల్లతో బయలుదేరుతున్న ముస్లింలు - ముస్లింలను కొండపైకి వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

టి.నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుప్పరంకుండ్రం పర్వతం పైనున్న దర్గాలో ముస్లింలు మేకలు, కోళ్లను బలివ్వడంపై నిషేధం విధించారు. అంతే కాకుండా ఆ పర్వతంపై జంతువులను బలివ్వడానికి ఎవరూ వెళ్లకుండా కొండ దిగువనే పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరుప్పరంకుండ్రం పర్వతంపైనున్న సికిందర్ పాదుషా అవులియా దర్గా చందనోత్సవం ఈ నెల ఒకటిన పతాకావిష్కరణతో ప్రారంభమయ్యాయి. ఈ నెల 17 రాత్రి చందనగూడు వైభవం నిర్వహించారు. ఆ నేపథ్యంలో శనివారం ఉదయం దర్గా కందూరి వేడుకలు సందర్భంగా మేకలు, కోళ్ల బలి ఇవ్వనున్నట్లు ముస్లిం పెద్దలు ప్రకటించారు. ఆ ప్రకటనపై స్థానిక భక్తులు, హిందూ సంస్థలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీనితో పోలీసులు ఆ పర్వతంపై జంతుబలులను నిషేధించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం సమైక్య జమాత్‌కు చెందిన ఖాదర్ ఇతర ముస్లిం సంస్థల నిర్వాహకులు మేకపోతును కొండపైకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అడ్డుకుని, కొండపై జంతుబలులు నిషేధించినట్లు తెలిపారు. ఆ సందర్భంగా పోలీసులు వారితో చర్చలు జరిపి కొండపై శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. దీంతో ముస్లిం సోదరులంతా తమ ప్రయత్నాలను విరమించుకున్నారు. ఆ తర్వాత డీసీపీలు ఇనికో దివ్యన్, అనితా, తిరుమలైకుమార్ నాయకత్వంలో ఏసీపీలు గురుసామి, శూరకుమార్ పర్యవేక్షణలో సుమారు 600 మంది పోలీసులతో కొండపైకి వెళ్లే రహదారిని, పెద్ద రథం వీధి తదితర ప్రాంతంలోను బందోబస్తు పెట్టారు. పర్వతంపై కాశీ విశ్వనాథుడి ఆలయం, దర్గాకు వెళ్లే భక్తులను తనిఖీ చేసిన మీదటే అనుమతించారు. జిల్లా రెవెన్యూ అధికారి శక్తివేల్, తిరుమంగళం సబ్ కలెక్టర్ రాజగురు, మదురై సౌత్ తహసీల్దార్ రాజపాండి తదితరులు తిరుప్పరంకుండ్రం పర్వత ప్రాంతం వద్దే మకాం పెట్టారు.

'ముసిరి'లో వెలుగు చూసిన తీర్థబావి



చంద్రమౌళీశ్వరాలయంలో బయల్పడిన తీర్థబావి

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా ముసిరి ప్రాంతంలోని చంద్రమౌళీశ్వరాలయంలో ఎన్నో దశాబ్దాలపాటు పొదలమాటున ఉన్న తీర్థ బావి ఎట్టకేలకు బయటపడింది. ప్రస్తుతం ఈ ఆలయంలో కుంభాభిషేకం జరిపేందుకు జీర్ణోద్ధరణ పనులు జరుగుతున్నాయి. ఆలయం ప్రాంగణంలో దక్షిణ దిశలో కొన్ని దశాబ్దాలుగా పొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో ఆ పొదలమాటున పాములు, క్రిమికీటకాలుంటాయని ఎవరూ అక్కడకు వెళ్లేవారు కాదు. ఈ నేపథ్యంలో జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా కార్మికులు పొదలను, పిచ్చి మొక్కలు తొలగించగా ఓ బావి కనిపించింది. ఈ విషయాన్ని కార్మికులు ఆలయ నిర్వాహకులకు తెలపడంతో దేవాదాయ శాఖ అధికారులు, ఆలయట్రస్టు బోర్డు సభ్యులు అక్కడికి చేరుకుని ఆ బావి దెబ్బతినకుండా పొదలను తొలగించి వెల్లవేయించారు. ఆ బావి గోడపై నలుగురు మునీశ్వరులు కాపలాకాస్తున్నట్లు శిల్పాలున్నాయి. ఆ బావిలో 400 అడుగుల లోతున ముకుంద మునీశ్వరుడనే సిద్ధపురుషుడు, 200 అడుగుల లోతున ఆయన శిష్యుడు నాదముని తపస్సు చేస్తుండేవారిని వారికి బావి పైభాగన నలుగురు మునులు కాపలాగా ఉండేవారని, ఆ బావి కాలగమనంలో మాయమైనట్లు ఆలయ అర్చకుల పూర్వీకులు చెబుతుండేవారని నిర్వాహకులు తెలిపారు. అర్చకుల పూర్వీకులు పేర్కొన్న బావి ఈ తీర్థబావిగానే ఉంటుందని తాము భావిస్తున్నామని చెప్పారు. ఏది ఏమైనప్పటికీ ప్రస్తుతం ఈ తీర్థబావిలోని జలాలతోనే స్వామివారికి అభిషేకాలు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఈ తీర్థబావిని చూడటానికి భక్తులు బారులు తీరారు.

పురాతన బంగారు నాణెం, అరుదైన మట్టికుండ లభ్యం



లభ్యమైనమట్టి కుండ

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లాలోని పాలారు నదీతీరంలో జరిపిన తవ్వకాల్లో తిరువాంకూర్ సంస్థానానికి చెందిన బంగారు నాణెం, మట్టికుండ బయల్పడ్డాయి. తిరువణ్ణామలై జిల్లా సెయ్యారు అన్నా ప్రభుత్వ కళాశాల భూగోళశాస్త్ర అధ్యాపకులు, పరిశోధనా విభాగం విద్యార్థులు చెంగల్పట్టు జిల్లా తిరుకళికుండ్రం, మదురాంతకం ప్రాంతాల్లో పాలారు నదీతీరంలో గత 16 ఏళ్లుగా మట్టి తవ్వకాలు నిర్వహించి, అరుదైన పురాతన వస్తువులను సేకరిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల జరిపిన తవ్వకాల్లో పురాతన నాణేలు, మట్టిపాత్రలను కనుగొన్నారు. పల్లవ రాజులు, చోళ చక్రవర్తులు, సంపూర్వరాయర్ ప్రభువుల కాలం నాటి రాగి నాణాలు, తిరువాంకూర్ సంస్థానం ప్రభువు వీర నారాయణన్ కాలంనాటి బంగారు నాణేన్ని తవ్వకాల్లో కనుగొన్నారు. ఈ నాణాన్ని పరిశీలించి 40 శాతం బంగారం, 50 శాతం వెండి, రాగి మిశ్రమంతో తయారుచేసినట్లు నిర్ధారించారు. అదే విధంగా 3వ శతాబ్దం నాటి మట్టికుండ సిథిలాలు మొట్టమొదటి సారిగా పాలారు నదీతీరంలో బయటపడినట్లు పరిశోధకులు తెలిపారు. వీటిని ప్రభుత్వ మ్యూజియంకు అప్పగించనున్నట్లు అన్నా ప్రభుత్వ కళాశాల పరిశోధన అధికారి మదురై వీరన్ తెలిపారు.

నిరుపేద విద్యార్థుల విమానయానం

● కోరిక నెరవేర్చిన ప్రధానోపాధ్యాయుడు



మదురై విమానాశ్రయం వద్ద సందడి చేస్తున్న విద్యార్థులు

టి.నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా కొండలూరు ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న ఐదో తరగతి విద్యార్థుల కోరిక మేరకు వారిని విమానంలో చెన్నై తీసుకెళ్లిన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని పలువురు ప్రశంసలతో ముం చెత్తుతున్నారు. ఆ పాఠశాలలో 95 మంది విద్యార్థినీ విద్యార్థులు చదువుతున్నారు. ఈ నేపథ్యంలో ఐదో తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయులు కలిసి రెండు రోజులు విహారయాత్రగా మదురై నుంచి చెన్నైకి విమానంలో ప్రయాణం చేశారు. ఆ పాఠశాలలో కొద్ది రోజుల క్రితం రైట్ సోదరులకు సంబంధించిన పాఠం చెబుతున్నప్పుడు ఐదో తరగతి విద్యార్థులు హెచ్ఎం మైఖేల్ రాజ్ దగ్గరకు వెళ్లి తమకు విమానంలో ప్రయాణించాలనే ఆశగా ఉందని తెలిపారు. ఆ విద్యార్థుల కోరిక తీర్చేందుకు మైఖేల్‌రాజ్ తీవ్రంగా ప్రయత్నించి ఆ వూరిలోని స్థానికులు, స్నేహితులు, దుబాయ్‌లో ఉన్నతోద్యోగాలు చేస్తున్న స్నేహితుల నుంచి విమాన ప్రయాణానికి అవసరమైనంత విరాళాలు సేకరించారు. శనివారం ఉదయం ఐదో తరగతి చదువుతున్న 20మంది బాలబాలికలు, ప్రధానోపాధ్యాయుడు మైఖేల్ రాజ్ సహా ఐదుగురు ఉపాధ్యాయులు మదురై నుంచి రాజధాని నగరం చెన్నైకి విమానంలో బయల్దేరారు.తొలిసారి విమానం ఎక్కి న ఆ చిన్నారుల సంతోషానికి పట్టపగ్గాలు లేకపోయింది. విమానంలో చెన్నై చేరుకున్న తర్వాత బిర్లా ప్లానిటోరియం, అన్నా శతజయంతి స్మారక గ్రంథాలయం, ఎగ్మూరు మ్యూజియం, సచివాలయం, హైకోర్టు, వళ్లువర్‌కోట్టమ్, దివంగత అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత, కరుణానిధి సమాధులను, వండలూరు జంతు ప్రదర్శనశాలను సందర్శించారు. ఆదివారం రాత్రి విద్యా విహారయాత్ర ముగించుకుని పొదిగై ఎక్స్‌ప్రెస్ రైలులో తెన్‌కాశికి బయలుదేరారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడు మైఖేల్‌రాజ్ మాట్లాడుతూ ఈ విమాన ప్రయాణం గ్రామీణ ప్రాంతానికి చెందిన ఐదో తరగతి విద్యార్థుల జీవితంలోనే మరచిపోలేని మధురమైన సంఘటనగా గుర్తుండిపోతుందనిచెప్పారు.ఈ యాత్ర కోసం మొత్తం సుమారు రెండు లక్షల మేరకు ఖర్చుచేశామని, విద్యార్థుల విమాన యాత్రకు విరాళాలిచ్చిన తన స్నేహితులకు, స్థానికులుకు మైఖేల్‌రాజ్ ధన్యవాదాలు తెలిపారు.

జ్యోతిష్యం ఫలించలేదన్న కోపంతో హత్య

● వివాహిత సహా ఇద్దరి అరెస్టు

టి.నగర్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మనస్పర్థల కారణంగా విడిపోయిన భర్తతో కలిసి కాపురం చేస్తావని, దంపతుల మధ్య అన్యోన్యత ఏర్పడుతుందని చెప్పిన జ్యోతిష్యం ఫలించకపోవడంతో జ్యోతిష్యుడిని కిరాయి గూండాతో హత్యచేయించిన మహిళ ఉదంతం నాగర్‌కోవిల్‌లో చోటుచేసుకుంది. నాగర్‌కోవిల్ కోట్టవిలై ప్రాంతంలో జాన్‌స్టీవన్ (58) నాటు వైద్యుడిగా ఉంటూ జ్యోతిష్యం కూడా చెబుతుంటారు. ఈ నెల 8న జాన్‌స్టీవన్ ఇంటిదగ్గర వంటినిండా గాయాలతో మరణించి ఉండగా కనుగొన్నారు. పోస్టుమార్టం నివేదికలో జాన్‌స్టీవన్ హత్యకు గురైనట్లు తెలియడంతో పోలీసులు హత్యకేసుగా నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. జాన్‌స్టీఫెన్‌కు వచ్చిన ఫోన్‌కాల్స్ పరిశీలించి ఎక్కువ సార్లు ఫోన్ చేసిన కరువేలంకుళం ప్రాంతానికి చెందిన నంబిరాజన్ (25) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. ఆ విచారణలో కట్టిమాంగాడు ప్రాంతానికి చెందిన కళైయరసి (43) అనే వివాహిత కిరాయి గూండా నంబిరాజన్‌తో హత్యచేయించినట్లు వెల్లడైంది. పోలీసులు కళైయరసిని అరెస్టు చేసి విచారించగా పలు వివరాలు వెల్లడయ్యాయి. మూడేళ్ల క్రితం కళైయరసి జాన్‌స్టీవన్‌కు డబ్బులిచ్చి తన జాతకాన్ని చూపెట్టింది. జాన్‌స్టీవన్ జాతకం చూసి కళైయరసి, ఆమె భర్త మధ్య అన్యోన్యత పెరిగేందుకు పరిహార పూజలు చేస్తానని తెలిపి వేలాది రూపాయలను వసూలు చేశాడు. రెండు మూడు నెలల తర్వాత దంపతులు అన్యోన్యంగా ఉంటారని ఆయన తెలిపాడు. అయితే ఆ జ్యోతిష్యం ఫలించకపోగా భర్త ఆమెను విడిచిపెట్టేందుకు కూడా సిద్ధమయ్యాడు. దీంతో తప్పుడు జ్యోతిష్యం చెప్పి, పరిహార పూజల పేరిట తన వద్ద భారీగా డబ్బులు గుంజిన జాన్‌స్టీవన్‌ను కిరాయి గూండా నంబిరాజన్‌ను పంపి హత్య చేయించింది. ఈ మేరకు వాంగూల్మం ఇచ్చిన కళైయరసిని, కిరాయి గూండా నంబిరాన్‌ను పోలీసులు జైలుకు తరలించారు.

87.32 మెట్రిక్ టన్నుల వ్యర్థాల తొలగింపు : జీసీసీ



చెత్త తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగ రోజుల్లో నగరంలో 87.32 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తొలగించినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. భోగి పండుగ రోజున పర్యావరణం కాలుష్యాన్ని నివారించే దిశగా ప్రజల నుంచి ప్లాస్టిక్, టైర్లు, పాత దుస్తులను జీసీసీ సిబ్బంది సేకరించారు. ఈ నెల 11నుండి 13వ తేదీ వరకు 31.79 మెట్రిక్ టన్నుల పాత దుస్తులు, 18.80 మెట్రిక్ టన్నుల టైర్లు, ట్యూబ్‌లు, 24.14 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ వస్తువులు 12.31 మెట్రిక్ టన్నుల ఇతర వస్తువుల 87.32 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తొలగించినట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా పొంగల్ పండుగ సందర్భంగా ఈ నెల 12 నుండి 17వ తేదీ వరకు మొత్తం 34,748 మెట్రిక్ టన్నుల గణ వ్యర్థాలను తొలగించినట్లు తెలిపారు.

'108' సేవలు ప్రశంసనీయం

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను సకాలంలో ఆస్పత్రికి తరలించి కాపాడటంలో 108 అంబులెన్స్ సేవలు అభినందనీయమని రాష్ట్ర పోలీసు శాఖ తెలిపింది. రాష్ట్రంలో ఈఎంఆర్ఐ - గ్రీన్‌హెల్త్ సర్వీస్ సంస్థ ఆధ్వర్యంలో 108 అంబులెన్స్ సేవలు అందుబాటులో ఉన్నాయి. 1,353 అంబులెన్స్‌ల్లో 303 వాహనాల్లో ప్రాణాలు కాపాడే ఉన్నత వైద్య సదుపాయాలు కల్పించారు. ఇవి కాకుండా రోడ్డు సదుపాయం లేని కొండ ప్రాంతాలు, మారుమూల గ్రామాలకు 40కి పైగా 108 వాహనాలను నడుపుతున్నారు. 10 వేలకు పైగా ప్రమాదాలకు సంబంధించి కాల్స్ వస్తున్న నేపథ్యంలో సుమారు 7 వేల మందికి పైగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో 2024వ సంవత్సరం 18.35 లక్షల మంది అంబులెన్స్ సేవల వల్ల లబ్ధి పొందినట్లు గ్రీన్‌హెల్త్ సర్వీస్ ప్రకటించింది. రోడ్డు ప్రమాదాల్లో 3.53 లక్షల మంది, 3.42 లక్షల మంది గర్భిణులు, గుండె సమస్యలున్న 1.17 లక్షల మంది, శ్వాసకోశ సమస్యలున్న 1.08 లక్షల మంది 108 అంబులెన్స్‌ల వల్ల లబ్దిపొందినట్లు ఆ సంస్థ చైర్మెన్ సెల్వకుమార్ తెలిపారు.

గంటపాటు రక్తమోడుతూ..!

● ప్రమాదంపై సకాలంలో స్పందించని పోలీసులు.. రాని హైవే అంబులెన్సు ● ఆలస్యంగా ఆస్పత్రికి తరలింపు
● ప్రమాద స్థలంలో ఇద్దరు పిల్లల దుర్మరణం ● చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి
● ఒకరి పరిస్థితి విషమం, ఇద్దరికి తీవ్ర గాయాలు ● మృతులు, క్షతగాత్రులది కోయంబత్తూరు

చంద్రగిరి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గోల్డెన్ అవర్. ప్రమాదాలు జరిగినప్పుడు వీలైనంత త్వరగా ఆస్పత్రికి తీసుకెళ్లాలి. ఏ మాత్రం ఆలస్యం జరిగిన తీవ్రంగా గాయపడిన వారి ప్రాణాలు పోవచ్చు. కానీ, ఆదివారం సాయంత్రం చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ రవణప్పగారిపల్లె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరు మృతిచెందగా.. మిగిలిన క్షతగాత్రులు గంటపాటు రక్తమోడుతూ విలవిలలాడుతూ గడపాల్సి వచ్చింది. హైవేపై గస్తీ తిరిగే పోలీసులు.. హైవే అంబులెన్సు సకాలంలో రాకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

తిరుమల శ్రీవారి దర్శనార్థం భార్య ఐశ్వర్య, కుమారులు జీవన్, విశ్వ, అత్త కలైవాణి, బావమరిది సతీష్‌తో కలిసి కోయంబత్తూరుకు చెందిన కార్తికేయ కారులో బయలుదేరారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు రవణప్పగారిపల్లె వద్ద వీరి కారు లారీని ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జు నుజ్జు కావడంతో ముందు సీట్లో ఉన్న జీవన్(10), విశ్వ(8) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారు తీవ్ర రక్త గాయాలతో అల్లాడుతున్నా హైవేలో నిత్యం గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు కానీ, కేవలం జాతీయ రహదారిలో జరిగే ప్రమాదాలకు మాత్రమే వచ్చే అంబులెన్స్ కానీ రాలేదు. ఇక, ఈ ప్రమాదంతో కిలోమీటర్ల కొద్దీ వాహనాల రాకపోకలు స్తంభించాయి. కూతవేటు దూరంలోనే టోల్ ప్లాజా ఉంది. గంట పాటూ క్షతగాత్రులకు సాయం అందలేదు. చివరకు స్థానికుల సమాచారంతో పాకాల నుంచి ఆరు గంటలకు 108 అంబులెన్స్ వచ్చింది. క్షతగాత్రులను తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 8 గంటల ప్రాంతంలో కలైవాణి(45) మృతి చెందారు. కారు నడుపుతున్న కార్తికేయ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఐశ్వర్య, ఆమె సోదరుడు సతీష్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తీవ్రంగా గాయపడిన ఐశ్వర్య





ఆస్పత్రిలో మృతి చెందిన కలైవాణి - సంఘటనా స్థలంలో మృతిచెందిన చిన్నారులు జీవన్, విశ్వ

సమాచార దృష్టి

28న కంభరామాయణంపై వక్తృత్వ పోటీలు

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో ఈ నెల 28న కంభరామాయణంపై వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నారు. చెన్నై చెంగల్పట్టు, తిరువళ్లూరు జిల్లాలోని 8వ తరగతి నుంచి ప్లస్‌టూ వరకు చదువుతున్న పాఠశాల విద్యార్థులు ఎనిమిది నిమిషాలు కంభరామాయణంలోని కీలక ఘట్టాలపై మాట్లాడాలి. కీల్పాక్‌లోని భారతీయ విద్యాభవన్‌లో 28వ తేదీ ఉదయం 10 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయి. అలాగే కళాశాల విద్యార్థులు కంబర్ గుర్తించిన రాముడు అనే శీర్షికపై 10 నిమిషాల పాటు మైలాపూర్‌లోని భారతీయ విద్యాభవన్‌లో కార్యక్రమంలో మాట్లాడాల్సివుంటుంది. వివరాలకు 9500080515 అనే నెంబరుకు సంప్రదించవచ్చు.

ప్రయాగ్‌రాజ్‌కు తిరువళ్లువర్ విగ్రహం

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లోని త్రివేణి సంగమంలో ప్రతిష్ఠించేందుకు చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలో రూపొందించిన తిరువళ్లువర్ విగ్రహాన్ని పంపించారు. ప్రయాగ్‌రాజ్‌లో ఈ నెల 13న ప్రారంభమైన మాహాకుంభ మేళా 45 రోజుల పాటు కొనసాగనుంది. త్రివేణి సంగమం ప్రాంతంలో నివసిస్తున్న తమిళ భాష సంఘ నిర్వాహకులు అలహాబాద్ కార్పొరేషన్ అనుమతితో ఆ ప్రాంతంలోని దక్షిణ తీరం రోడ్డుకు 2017లో తిరువళ్లువర్ అనే పేరుపెట్టారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మహాకుంభ మేళా సందర్భంగా తిరువళ్లువర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయించింది. ఇందుకోసం మహాబలిపురంలోని క్రియేటివ్ సంస్థ 5అడుగుల ఎత్తు 4.20 అడుగుల వెడల్పుతో తిరువళ్లువర్ విగ్రహాన్ని కళాత్మకంగా రూపొందించింది. ఈ విగ్రహాన్ని శనివారం కంటైనర్ ద్వారా పంపించినట్లు తెలిపారు.

25 వరకు పొంగల్ కానుక పంపిణీ

● మంత్రి పెరియ కరుప్పన్

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రేషన్ షాపుల ద్వారా ఈ నెల 25వ తేదీ వరకు పొంగల్ కానుక పంపిణీ జరుగుతుందని సహకార శాఖామంత్రి పెరియ కరుప్పన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పొంగల్ పండుగ సందర్భంగా బియ్యం కార్డులు, శ్రీలంక శరణార్థులకు కిలో పచ్చి బియ్యం, కిలో చెక్కర, రెండు చెరకు గడలను రాష్ట్రప్రభుత్వం ప్రకటించిందని, ఆ మేరకు 9వ తేదీ ట్రిప్లికేన్‌లో ముఖ్యమంత్రి స్టాలిన్ పొంగల్ కానుక పంపిణీకి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని 34,793 రేషన్ దుకాణాల్లో 2.25 కోట్ల రేషన్ కార్డుదారులకు, శ్రీలంక శరణార్థులకు పొంగల్ కానుక పంపిణీ జరిగిందని తెలిపారు. సహకార శాఖలో పనిచేస్తున్న 50వేల మంది ఉద్యోగులు శనివారం వరకు 1,87,14,464 కుటుంబ కార్డులకు పొంగల్ కానుకతో పాటు ఉచిత చీర, దోవతులు పంపిణీ చేశారని మంత్రి తెలిపారు. కాగా, పొంగల్ కానుక తీసుకోనివారి కోసం ఈ నెల 25వ తేదీ వరకు ఈ పథకాన్ని పొడిగించినట్లు మంత్రి పెరియ కరుప్పన్ తెలిపారు.

ఒకే రోజు రూ.225 కోట్లమేర చికెన్ విక్రయాలు

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కానుంపొంగల్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.225 కోట్ల మేర చికెన్ విక్రయాలు జరిగాయని పౌల్ట్రీ వ్యాపారులు హర్షం వ్యక్తంచేశారు. సహజంగా పొంగల్ సందర్భంగా రాష్ట్రంలో చికెన్ విక్రయాలు ఆశించినంత మేర జరగవు. అయితే ఈ సంవత్సరం కానుంపొంగల్ రోజైన గత 16వ తేదీ అధిక స్థాయిలో చికెన్ విక్రయాలు ఊపందుకున్నాయి. సుమారు 2.5 కోట్ల కిలోల చికెన్ విక్రయించారు.

డెల్టా, కోస్తా జిల్లాలకు వర్ష సూచన

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డెల్టా, కోస్తా జిల్లాలు, కొన్ని దక్షిణ జిల్లాల్లో సోమవారం నుంచి రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ పరిశోధనా కేంద్రం హెచ్చరించింది. రాష్ట్రం వైపు వీస్తున్న తూర్పు గాలుల ప్రభావంతో శనివారం సాయంత్రం చెన్నై, తిరువళ్లూరు, పుదుచ్చేరి, చెంగల్‌పట్టు తదితర ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. సోమవారం నుంచి మంగళవారం వరకు డెల్టా, కోస్తా, దక్షిణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖా తెలిపింది. శనివారం ఉదయం 8 గంటల వరకు గరిష్ఠంగా తిరునల్వేలి జిల్లా 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ నేపథ్యంలో రానున్న 24 గంటల్లో కన్నియాకుమారి సముద్రంలో గంటలకు 35 నుండి 45 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, మధ్యలో 55 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని, అందువల్ల ఈ ప్రాంతాలకు జాలర్లు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ అయ్యాయి.

ఆంధ్రాలో పాఠ్యపుస్తకాల ముద్రణా?

● దినకరన్ ఆగ్రహం

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తకాలను ముద్రించే పనులను ఆంధ్రప్రదేశ్‌లోని ముద్రణా సంస్థలకు అప్పగించడం పట్ల ఏఎంఎంకే అధ్యక్షుడు టీటీవీ దినకరన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పుస్తకాల ముద్రణకు ప్రసిద్ధిచెందిన శివకాశి నగరం ఉండగా ఆంధ్రాలో ముద్రించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం పాఠ్యపుస్తకాల ముద్రణ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ ముద్రణా సంస్థలకు ఇవ్వడం గర్హనీయమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

● కోవిడ్ సమయంలో ఆందోళన....

35 మందిపై కేసు రద్దు

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కరోనా లాక్‌డౌన్ రోజుల్లో రుణమాఫీ కొరుతూ పోరాడిన 35 మందిపై నమోదైన కేసును హైకోర్టు మదురై బెంచ్ రద్దు చేసింది. మదురైకి చెందిన గాంధీ, వీరన్ తదితర 35 మంది స్వయం సహాయక బృందాల సభ్యులు మదురై బెంచ్‌లో ఓ పిటిషన్ వేశారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో ప్రభుత్వం మంజూరు చేసిన రుణాలను మాఫీ చేయాలని కోరుతూ ఆందోళనలు నిర్వహించామని, ఆ సందర్భంగా పోలీసులు తమపై కేసులు పెట్టారని తెలిపారు. ఇలా తమపై నమోదైన కేసులను రద్దు చేయాలని కోరారు. శుక్రవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ సమక్షంలో ఇరుపక్షాల న్యాయవాదులు హాజరై తమ వాదనలు వినిపించారు. కరోనా లాక్‌డౌన్ రోజుల్లో పోరాడిన 35 మందికి సంబంధించి మదురై మేలూర్ న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న కేసు రద్దు చేస్తున్నట్లు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై జిల్లా నల్లవన్‌పాళయంలో హైవే రోడ్డులో నడిచి వెళ్తున్న ఓ వ్యక్తి కారు ఢీకొనంతో అక్కడ ఇకక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. నల్లవన్‌పాళయంకు చెందిన గోపాలన్ (34) శనివారం సాయంత్రం తన మిత్రులతో కలిసి నడిచి వెళ్తుండగా ఓ కారు అదుపు తప్పి దూసుకొచ్చింది. ఈ క్రమంలో గోపాలన్‌కు తీవ్రగాయాలు కాగా, కారు డ్రైవర్ పరారయ్యాడు. గోపాలన్‌ను మిత్రులు వెంటనే దగ్గరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ సమాచారం తెలుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని కేసు నమోదుచేసి, ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

విదేశీ మద్యం స్మగ్లింగ్ కేసు

కానిస్టేబుల్ సహా ముగ్గురి అరెస్ట్

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలో విదేశీ మద్యం స్మగ్లింగ్ చేసిన కేసులో చెన్నై కానిస్టేబుల్ సహా ముగ్గురిని గూండా చట్టం కింద పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లాలోని నత్తం నుంచి మదురై వెళ్లే రహదారిలో ఈ నెల 5వ తేదీ దిండుగల్ ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. ఆ సమయంలో రెండు ద్విచక్ర వాహనాల్లో వెళ్తున్న వారిని అడ్డుకుని విచారణ జరిపారు. ఇందులో చెన్నై ఆవడిలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ముత్తుకుమార్, తిరుపత్తూరుకు చెందిన అళంగుపాండి, శరత్‌కుమార్‌ల నుండి 129 విదేశీ మద్యం సీసాలను, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో దిండుగల్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఈ ముగ్గురిని గూండా చట్టం కింద అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రౌడీ షీటర్‌తో సంక్రాంతి సంబరాలు..

పోలీసులపై బదిలీ వేటు

ఐసిఎఫ్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్‌తో కలిసి సంక్రాంతి పండుగ జరుపుకున్న కంధిలి పోలీస్‌స్టేషన్ అధికారులపై బదిలీ వేటు పడింది. తిరుపత్తూరు జిల్లా కంధిలి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐలు కార్తిక్, అజిత్, స్పెషల్ ఎస్ఐ ఉమాపతి అదే ప్రాంతంలోని ఓ రౌడీ షీటర్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌లో సంక్రాంతి పండుగ జరుపుకోవడంతో జిల్లా పోలీసు అధికారులకు సమాచారం అందింది. జిల్లా ఎస్పీ గుప్తా విచారించి ఈ ముగ్గురిని సాయుధ దళాలకు బదిలీ చేశారు.

పోలీసుపై దాడి.. ముగ్గురి అరెస్ట్

ఐసిఎఫ్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పోలీసుపై దాడి చేసి గాయపరచిన ముగ్గురు యువకులు కటకటాల పాలైన ఘటన తిరుపత్తూరు జిల్లాలో చోటుచేసుకుంది. తిరుపత్తూరు జిల్లా నాట్రంపల్లి, అగ్రహారం ప్రాంతానికి చెందిన శబరి చెన్నైలో తమిళనాడు స్పెషల్ ఫోర్స్‌లో పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా తన సొంతూరు వెళ్లాడు. గత 15 తేదీ శబరి అదే ప్రాంతంలోని మద్యం దుకాణంలో మద్యం సేవిస్తున్న సమయంలో అక్కడేవున్న తిరుమలైవాసన్, విజయ్, పుష్పరాజ్‌తో గొడవ జరిగింది. ఈ క్రమంలో ముగ్గురు యువకులు ఒక్కసారిగా శబరిపై దాడి చేసి పరారయ్యారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఆ యువకులను అరెస్ట్ చేసి జైలుకి తరలించారు.

సారా ప్యాకెట్లతో యువకుడి అరెస్ట్



వేలూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తం సమీపంలోని బత్తలపల్లి ప్రాంతంలోని ఓ ఇంట్లో సారా విక్రయం జరుగుందనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. తనిఖీ చేసిన పోలీసులు సురేష్ అనే వ్యక్తి చట్టవిరుద్ధంగా కర్ణాటక మద్యం, సారా ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు సుమారు 816 సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని సురేష్‌ను అరెస్ట్ చేశారు. ఇతడు సుబ్రమణ్యం అనే వ్యక్తితో పాటు మరో ఇద్దరి సాయంతో ఈ విక్రయాలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. మిగిలిన ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఇనుప చువ్వల చోరీ

● యువకుడి అరెస్ట్

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడులోని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) సంస్థలో 400 కిలోల ఇనుప చువ్వలను చోరీ చేసిన యువకుడిని తిరుమంగళం పోలీసులు అరెస్ట్ చేశారు. కోయంబేడు రోడ్డులో శుక్రవారం పోలీసుల వాహన తనిఖీలో గోనె సంచితో వెళ్లే యువకుడిని ఆపి తనిఖీ చేసి, ఇనుప చువ్వలు తరలిస్తున్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. అతడి నుంచి బోల్టులు, ఇనుప చువ్వలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితుడు పాడికి చెందిన వెంకటేశన్‌గా గుర్తించారు. అతను కోయంబేడులో మెట్రోరైలు పనులు జరుగుతున్న ప్రాంతాల నుండి కొద్ది కొద్దిగా ఇనుప చువ్వలు, బోల్టులు దొంగిలించినట్లు పోలీసుల ముందు అంగీకరించాడు. కేసు నమోదు చేసి కోర్టు ఉత్వర్వుల మేరకు వెంకటేశన్‌ను రిమాండ్‌కు తరలించారు.

అన్నదాతలకు శోకం మిగిల్చిన అకాలవర్షం



తంజావూరులో వర్షానికి తడిసి వాలిన వరిపైరు

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లాలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి వేలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట నీటమునిగింది. తంజావూరు, వన్నారపేట, బూతలూరు, ఆలక్కుడి, కల్వరాయన్ పేట్టై, చిత్తిరక్కుడి, శీరాలూరు తదితర ప్రాంతాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట వాననీటిలో తడిసి నేలపై వాలింది. తమ కళ్లెదుటే తడిసిన పంటలను చూసి అన్నదాతలు కంటతడిపెట్టుకున్నారు. ఈ విషయమై అక్కడి రైతు మాట్లాడుతూ వాననీటిలో తడిసిన కారణంగా దిగుబడి బాగా తగ్గుతుంది. ఎకరాకు రూ.40 వేల దాకా ఖర్చుపెట్టి పండించగా, ఎకరాకు 25 బస్తాల వడ్లు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం అకాలవర్షంలో తడిసిన వరిపంటలకు తగు నష్టపరిహారం ప్రకటించి తమను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

మనశ్శాంతి కోసమే అన్నామలైయార్ దర్శనానికి : రవి మోహన్


అరుణాచలేశ్వరంలో రవి మోహన్

తమిళ చిత్రజ్యోతి

మనశ్శాంతి కోసమే అరుణాచలేశ్వర స్వామి ఆలయానికి వచ్చానని హీరో రవి మోహన్ పేర్కొన్నారు. ఆయన తాజాగా నటించిన 'కాదలిక్క నేరమిల్లై' పొంగల్ పండుగ సందర్భంగా విడుదలై, విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో హీరో రవి మోహన్ తిరువణ్ణామలై అరుణచలేశ్వరుడి దర్శనం చేసుకున్నారు. ఆలయానికి వచ్చిన హీరోకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలుకగా వేద పండితులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా రవి మోహన్ ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు, పూజారులు కలిసి ప్రసాదాలను అందజేశారు. దర్శనానంతరం రవి మోహన్ మడియాతో మాట్లాడుతూ, 'తన కొత్త చిత్రం సంక్రాంతికి విడుదలైంది. దీన్ని పురస్కరించుకుని అన్నామలైయార్ దర్శనం కోసం వచ్చాను. మనశ్శాంతి కోసమే దేవాలయానికి వచ్చాను. తల్లిదండ్రులతో ఉండటం మనశ్శాంతిగా ఉంది. దేవుడుకి కృతజ్ఞతలు. 'జీనీ' మూవీ షూటింగ్ 99 శాతం పూర్తయింది' అని వివరించారు.

ఆ ఒక్కటి మినహా... నిరాశపరిచిన పొంగల్ సినిమాలు!?


'మద గజ రాజా'లో ఓ దృశ్యం

ఈ యేడాది పొంగల్ పండుగకు మొత్తం ఆరు తమిళ చిత్రాలతో పాటు ఒక డబ్బింగ్ మూవీ విడుదలకాగా, ఒక్కటి మినహా మిగిలిన సినిమాలు ప్రేక్షకులతో పాటు బయ్యర్లను తీవ్రంగా నిరాశపరిచాయని కోలీవుడ్ వర్గాల సమాచారం. జనవరి 10వ తేదీన 'వణంగాన్', 'మద్రాస్‌కారన్' విడుదలయ్యాయి. వీటిలో 'వణంగాన్' మాత్రం కొంతమేరకు పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. అయితే, వ్యాపారపరంగా నిరాశపరిచింది. ఈ సినిమా హీరో అరుణ్ విజయ్ నటనకు మంచి మార్కులే వచ్చాయి. 'మద్రాస్‌కారన్' మూవీ మద్రాస్‌లో పూర్తిగా నిరాశపరిచింది. కాగా 12 యేళ్ళ క్రితం చిత్రీకరణ పూర్తి చేసుకుని జనవరి 12న రిలీజైన 'మద గజ రాజా' (ఎంజీఆర్)కు మాత్రం ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ఫలితంగా కలెక్షన్ల వర్షం కురిపిస్తుంది. ఇప్పటికే రూ.30 కోట్లకుపైగా వసూలు చేయగా, ఈ వారాంతానికి రూ.50 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. జనవరి 14న 'కాదలిక్క నేరమిల్లై', 'నేసిప్పాయ', 'తరుణం' మూవీలు విడుదలకాగా, 'తరుణం' మాత్రం ఒక్క రోజు మాత్రమే ప్రదర్శించి, తగిన సంఖ్యలో థియేటర్లు లభించలేదని సినిమా ప్రదర్శన నిలిపివేసి మళ్ళీ రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు. 'నేసిప్పాయ' మూవీ ఫర్వాలేదనిపించింది. 'కాదలిక్క నేరమిల్లై' మూవీ 'ఏ' సెంటర్లలో మంచి ఆదరణ లభించింది. కానీ, వసూళ్ళు మాత్రం అంతంతమాత్రంగా ఉన్నాయి. శంకర్ దర్శకత్వం వహించిన 'గేమ్ ఛేంజర్' తమిళ వెర్షన్ ఫలితం పూర్తిగా నిరాశపరిచింది. మొత్తంమీద 2025 సంక్రాంతి కొంతమేరకు మాత్రమే చక్కెర పొంగల్ రుచిని అందించింది. ఆరు సినిమాల్లో ఒకటి మాత్రమే ప్రేక్షకులకు నిజమైన సంక్రాంతి సంబరాన్ని అందించింది.

24న 'కుడుంబస్థన్'గా వస్తున్న మణికంఠన్


'కుడుంబస్థన్' చిత్ర బృందం

మణికంఠన్, శాన్వీ జంటగా నటించిన 'కుడుంబస్థన్' చిత్రం ఈ నెల 24న విడుదల చేయనున్నారు. సినిమాక్కారన్ ఎస్.వినోద్‌కుమార్ నిర్మాణంలో రూపొందిన ఈ మూవీకి దర్శకుడు రాజేశ్వర్ కాళిస్వామి, సినిమా ట్రైలర్ రిలీజ్ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, 'నా కలను నిజం చేసిన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు. ఈ మూవీ కోసం సాంకేతిక బృందం సహా నటీనటులు ఎంతగానో శ్రమించారు. ప్రతి ఒక్కరూ మెచ్చి ఆదరించే సినిమాగా రూపొందించాం' అని పేర్కొన్నారు. నటుడు మణికంఠన్ మాట్లాడుతూ 'రెండున్నరేళ్ళ క్రితమే దర్శకుడు రాజేష్ ఈ కథ వినిపించారు. ఆ సమయంలో నేను 'గుడ్ నైట్, 'లవర్' మూవీల కోసం ఒప్పందం కుదుర్చుకున్నాను. అయినప్పటికీ దర్శకుడు నా కోసం ఇంతకాలం వేచివున్నందుకు ధన్యవాదాలు. నిజానికి అడ్వెంచర్ స్క్రిప్టుతో రూపొందిస్తారని భావించారు. నేటి పరిస్థితుల్లో కుటుంబాన్ని పోషించడమే పెద్ద అడ్వెంచర్‌గా మారింది. ఈ మూవీతో పాటు 'బాటల్ రాధ' కూడా అదే రోజు విడుదలవుతుంది. సినిమాలో చిన్న గుర్తింపు తెచ్చుకోవాలంటే పెద్దపెద్ద పనులు చేయాలి. కానీ, నేను చేసిన ఒక పనికి పెద్ద గుర్తింపు వచ్చింది' అన్నారు. ఆ తర్వాత నటుడు గురుసోమసుందరం, హీరోయిన్ శాన్వి తదితరులు ప్రసంగించారు.

మాజీ భార్యతో కలిసి జీవి....


జీవీ ప్రకాష్ - సైంధవి

తన భార్య సైంధవికి విడాకులు ఇస్తున్నట్టు సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ ప్రకటించారు. కానీ, ఆమెతో కలిసి పనిచేస్తున్నారు. దీనిపై జీవీ ప్రకాష్ కుమార్ స్పందిస్తూ, 'మేమిద్దరం వైవాహిక బంధం నుంచి మాత్రమే వేరుపడుతున్నట్టు ప్రకటించాం. వృత్తిపరంగా ఒకరిపై ఒకరికి గౌరవం ఉంది. వ్యక్తిగత జీవితానికి వృత్తికి ఎలాంటి సంబంధం లేదు. అందుకే మేమిద్దరం కలిసి పనిచేస్తున్నాం' అని పేర్కొన్నారు. కాగా, 2013లో ప్రేమ వివాహం చేసుకున్న వీరిద్దరూ 11 యేళ్ళ వైవాహిక జీవితాన్ని కొనసాగించారు. వీరికి ఒక కుమార్తె కూడా ఉంది. ఈ నేపథ్యంలో సైంధవికి విడాకులు ఇస్తున్నట్టు జీవీ ప్రకాష్ ప్రకటించి ప్రతి ఒక్కరినీ విస్మయానికి గురిచేసిన విషయం తెల్సిందే. ఈ ప్రకటన తర్వాత జీవీ ప్రకాష్ నిర్వహించే సంగీత విభావరితోపాటు ఆయన సంగీతం సమకూర్చే చిత్రాల్లో కూడా ఆమె నేపథ్యగాయనిగా పనిచేస్తున్నారు.

వైభవంగా గోదా కల్యాణం


కల్యాణ క్రతువును జరిపిస్తున్న అర్చక స్వాములు


ప్రత్యేక అలంకరణలో గోదాదేవి

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొళత్తూరు సమీపంలోని పొన్నియమ్మన్‌మేడు, మోహన్ నగర్‌లో వెంకటాద్రి భజన సమాజం ఆధ్వర్యంలో ఆదివారం గోదా రంగనాథుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. అలంకరించిన వేదికపై ఆండాళ్ సమేత స్వామి వార్ల ఉత్సవ మూర్తులను ఉంచి అర్చకులు కల్యాణ క్రతువుకు శ్రీకారం చుట్టారు. నూతన మధ్యాహ్నం 12 గంటలకు భక్తుల గోవింద నామస్మరణ, వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణం జరిపించారు. వెంకటాద్రి భజన సమాజం నిర్వాహకులు కె.పద్మరాజ్, ఐశ్వర్య ఏర్పాట్లు పర్యవేక్షించి భక్తులకు తీర్థ ప్రసాదాలు, ముత్తైదువులకు పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. చివరగా అన్నమయ్య, త్యాగయ్య, కీర్తనలు ఆలపించి అలరించిన కళాకారులు, అర్చకులు, పుర ప్రముఖులను సంప్రదాయ బద్ధంగా సత్కరించారు.

శ్రీలంక విమానంలో రూ.79 లక్షల బంగారం స్వాధీనం

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి విమానాశ్రయంలో శ్రీలంక నుంచి వచ్చిన విమానం టాయ్‌లెట్‌లో రూ.79 లక్షల విలువైన 985 గ్రాముల రెండు బంగారు కడ్డీలను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 15న శ్రీలంక నుంచి వచ్చిన శ్రీలంకన్ ఎయిర్‌లైన్స్ విమానంలో ప్రయాణికులంతా దిగిన తర్వాత శుభ్రం చేసేందుకు పారిశుధ్య కార్మికులు వెళ్లగా విమానంలోని టాయ్‌లెట్ వద్ద పార్శిల్‌ను చూసి కస్టమ్స్ అధికారులకు సమాచారం ఇచ్చారు. కస్టమ్స్ అధికారులు విమానంలోని ఆ పార్శిల్ విప్పి చూడగా అందులో రెండు బంగారు కడ్డీలు లభించాయి. అధికారులు ఆ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.


కుత్రాలంలో జలపాత హోరు

తెన్‌కాశిలో కుండపోత

- కుత్రాలం జలపాతానికి వరద

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలో శనివారం అర్ధరాత్రి నుండి ఆదివారం వేకువ జాము వరకు కుండపోతగా కురిసిన వర్షాలకు చెరువులు, వాగులు, వంకలు, జలపాతాలన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. కుత్రాలం, ఐందరువి, పాత కుత్రాలం తదితర జలపాతాల వద్ద వరద పరిస్థితి నెలకొంది. జలపాతాల పైనుంచి నీటి ప్రవాహం వేగంగా పడుతుండంతో పర్యాటకులు స్నానానికి వెళ్లకుండా అధికారులు, పోలీసులు కట్టుదిట్టం చేశారు. మరో రెండు రోజులపాటు ఈ జలపాతాల వద్ద పర్యాటకులు స్నానానికి వెళ్ళకూడని నిషేధం విధించారు. ఆదివారం ఉదయం కుత్రాలం అంతటా చల్లటి వాతావరణం నెలకొనటంతో పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. అయితే జలపాతాల వద్ద నీటిధారలు ఉధృతంగా ఎగసిపడుతుండటంతో నిరాశతో తిరుగుముఖం పట్టారు.

ఎగ్జిబిషన్‌ను సందర్శించిన 90వేల మంది


సందర్శకులతో కిటకిటలాడుతున్న ఐలాండ్ గ్రౌండ్

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్ సమీపంలోని ఐలాండ్ గ్రౌండ్‌లో తమిళనాడు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీటీడీసీ) నిర్వహిస్తున్న 49వ ఎగ్జిబిషన్‌ను ఆరు రోజుల్లో 90.812 మంది సందర్శించారని అధికారులు తెలిపారు. ప్రతి ఏటా ఐలాండ్ గ్రౌండ్‌లో సుమారు 2 నెలల పాటు పర్యాటక ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఎగ్జిబిషన్‌లో రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలకు సంబంధించిన 43 స్టాల్స్ ఏర్పాటు చేశారు. మరోవైపు జెయింట్‌వీల్, రంగుల రాట్నం, బుల్లిరైలు, స్నోవాల్, అక్వేరియం, పక్షుల ప్రదర్శన, త్రిడీ థియేటర్, జలకన్య తదితరాలను వీక్షించేందుకు ప్రజలు పోటీపడుతున్నారు. ఈ ఎగ్జిబిషన్‌కు వెళ్లే ప్రజల సౌకర్యార్థం చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ నగరం నలుమూలల నుంచే కాకుండా శివారు ప్రాంతాల నుంచి కూడా బస్సులు నడుపుతోంది. ఇదిలా ఉండగా కానుం పొంగల్ రోజైన ఈ నెల 16న 36,769 మంది ఈ ప్రదర్శన తిలకించారు. ఎగ్జిబిషన్ ప్రారంభించిన 6 రోజుల్లో 74,930 మంది పెద్దలు, 17.882 మంది చిన్నారులు చొప్పున మొత్తం 90,812 మంది వీక్షించినట్లు పర్యాటక శాఖ అధికారులు తెలిపారు.



సిలంబమ్ ఆధ్వర్యంలో హెల్మెట్‌పై అవగాహన

వేలూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వేలూరు ట్రాఫిక్ పోలీసులు, ఎమ్.స్టార్ సిలంబమ్ పాఠశాల ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేలూరు గ్రీన్ సర్కిల్ ప్రాంతంలో 45 మంది విద్యార్థులు హెల్మెట్ వేసుకొని సుమారు అర్ధగంటకు పైగా రోడ్డు భద్రత, హెల్మెట్ ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ట్రాఫిక్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

→ హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ఆళ్వార్‌పేటలో అధునాతన డెర్మటాలజీ కేంద్రం

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేట, అంబుజమ్మాళ్ రోడ్డులో 'డాక్టర్ బి.360 డిగ్రీ డెర్మటాలజీ ఎక్స్‌పీరియన్షియల్ సెంటర్' ఏర్పాటు చేశారు. దీనిని చెన్నై సెంట్రల్ లోక్‌సభ సభ్యుడు దయానిధి మారన్ ఆదివారం ప్రారంభించారు. ఈ అత్యాధునిక వైద్య ఆవిష్కరణలు, లగ్జరీ, వ్యక్తిగతీకరించిన సంరక్షణ మిళితం చేస్తుందని, దేశంలోనే చర్మ సంబంధమైన, సౌందర్య ఆరోగ్యానికి కొత్త బెంచ్‌మార్క్ సెట్ చేస్తుందని నిర్వాహకులు డాక్టర్ భైరవి సెంథిల్ ప్రకటించారు. ఈ కేంద్రం సైన్స్, టెక్నాలజీ, విలాసాల కలయికను సూచిస్తుందన్నారు. ఇది అందంగా కనిపించడం మాత్రమే కాదని, ఇది మంచి అనుభూతిని కలిగిస్తుందని వివరించారు.


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ దయానిధి మారన్

రామనామస్మరణతో పాదయాత్ర



ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామ మందిరంలో బాలరాముని ప్రతిష్ఠ తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రాజధాని నగరంలో రామనామస్మరణతో భక్తులు పాదయాత్ర చేశారు. జై సరస్వతి ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెరంబూరులో శివ విష్ణు ఆలయంలో ఉదయం 6 గంటలకు గురుస్వామి భక్తవత్సలం, ట్రస్ట్ నిర్వాహకులు పీవీ కృష్ణారావు పర్యవేక్షణలో సీతారాములు, శ్రీవెంకటేశ్వర స్వామి వార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ప్రారంభించిన పాదయాత్రలో పాల్గొన్న భక్తులు మధ్యాహ్నం 12 గంటలకు టి.నగర్ జీఎన్‌చెట్టి రోడ్డులో ఉన్న పద్మావతి అమ్మవారి ఆలయానికి చేరుకొని కీర్తనలు ఆలపించారు. అక్కడి నుంచి టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులో టీటీడీ చేరుకోగా, ఏఈవో పార్థసారధి, పాలకమండలి మాజీ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ రెడ్డి, మాజీ సభ్యులు పీవీఆర్ కృష్ణారావు, బి.మోహనరావు తదితరులు ఘన స్వాగతం పలికారు. శ్రవణం హాలులో కీర్తనలు ఆలపించిన పాదయాత్ర భక్తులను ఘనంగా సత్కరించి, ట్రస్ట్ తరుఫున ధ్రువపత్రాలు అందజేశారు. అలాగే టీటీడీ ఆలయం తరుపున శ్రీవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందించారు. తెలుగుతరుణి సంగీత బృందం సభ్యులు మణిమాలరావు, వసంత, మాలతి, శిరీష, ముక్కాల భాషాకారులు కుబేంద్రన్, తేజ తదితరులు పాల్గొన్నారు.


స్తంభించిన ట్రాఫిక్

తిరుత్తణిలో భక్తుల రద్దీ

తిరుత్తణి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లాలోని తిరుత్తణి మురుగన్ ఆలయంలో పొంగల్ సెలవుల కారణంగా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు కొండపై వెలసివున్న మురుగన్ దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం కొండపైకి వెళ్ళే రోడ్డు మార్గంలో ట్రాఫిక్ జామ్ నెలకొంది. క్యూలైన్లల్లో కూడా సుమారు 3 గంటల సేపు వేచివుండి స్వామిని దర్శించుకున్నారు.

జాతీయ పండుగలా 'కాశీ తమిళ సంగమం'

- గవర్నర్ ఆర్ఎన్ రవి

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాశీ తమిళ సంగమంను జాతీయ పండుగగా జరుకుంటున్నట్లు గవర్నర్ ఆర్ఎన్ రవి పేర్కొన్నారు. తమిళనాడు - వారణాసి మధ్య సంబంధాలు బలపరచేలా కాశీ తమిళ సంగమం వేడుకలను ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం 3వ కాశీ తమిళ సంగమం ఫిబ్రవరి 15 నుంచి 24వ తేదీ వరకు జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం తరమణిలో ఏర్పాటు చేసిన ప్రారంభకార్యక్రమంలో ముఖ్య అతిథిగా గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాశీ పుణ్యక్షేత్రం మినీ ఇండియాగా గుర్తింపు పొంది, తమిళనాడుతో మంచి సంబంధాలున్నాయని, అందువల్లే కాశీ తమిళ సంగమంను జాతీయ పండుగగా జరుపుకుంటున్నట్లు గవర్నర్ తెలిపారు.

- తిరుత్తణిలో భారీవర్షం

భక్తులకు ఇబ్బందులు



తిరుత్తణి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణిలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో అక్కడి వీధులు జలమయమయ్యాయి. తిరువాలంగాడు, పళ్లిపట్టు, ఆర్‌కేపేట తదితర ప్రాంతాల్లో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు కురిసిన వర్షానికి నగర వీధులు, లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధమయ్యాయి. కొండపై నుండి వచ్చే వర్షపు నీటితో మెట్ల మార్గంలో వెళ్లే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురైయ్యారు.

రాయపేటలో 'కోకో' షోరూం


షోరూం ప్రారంభోత్సవంలో అలీషా అబ్దుల్లా

చెన్నై, జనవరి 19 (ఆంధ్ర జ్యోతి): ప్రీమియం ఎలక్ట్రిక్ మోటార్ సైకిళ్లలో అగ్రగామిగా వున్న శ్రీవారు హోల్డింగ్ లిమిటెడ్ (ఎస్‌వీఎం) రాయపేటలో 'ఫస్ట్ కంపెనీ-ఓన్డ్ కంపెనీ-ఆపరేటెడ్' (కోకో) షోరూం ప్రారంభించింది. భారత తొలి మహిళా జాతీయ రేసింగ్ ఛాంపియన్, మోటార్‌స్పోర్ట్స్ ట్రయల్ బ్లేజర్ అలీషా అబ్దుల్లా దీనిని శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీవారు మోటార్స్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అశ్విన్ కుమార్ మాట్లాడుతూ.. తమ సంస్థ ఒక కీలకమైన మైలురాయి అధిగమించిందన్నారు. తాము ఫ్లాగ్‌షిప్ షోరూంను చెన్నై తీసుకువచ్చామని, ఇది ఎప్పుడూ ఆవిష్కరణలు, చలనశీలతలో ముందంజలో వుందన్నారు.

తిరుప్పూర్‌లో వాటర్ స్పోర్ట్స్


నిండు కుండలా కావిలిపాళయం సరస్సు

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరులో మే నెలలో జలక్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు కావిలిపాళయం వాటర్ స్పోర్ట్స్ సంఘం ప్రకటించింది. తిరుప్పూరు-ఈరోడ్ జిల్లాల సరిహద్దులో 480 ఎకరాల్లో కావెలిపాళయం సరస్సు ప్రర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రాంతానికి చెందిన ప్రజలు కావిపాళయం బోట్, వాటర్ స్పోర్ట్స్ పేరుతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసేకున్నారు. ఈ సరస్సులో ప్రస్తుతం నీరు అధికంగా ఉన్నందున పడవల పోటీ, జలక్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. తమిళనాడు అమెచ్యూరు, కానొయిన్ సంస్థల సహకారంతో వచ్చే మే 31 నుంచి జూన్ 1 వరకు రాష్ట్రస్థాయి పడవల పోటీలు, జలక్రీడల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఐసిఎఫ్‌లో మొదటి ఏసీ సబర్బన్ రైలు



ఐసీఎఫ్‌లో తయారైన మొదటి సబర్బన్ ఏసీ రైలు

ప్యారీస్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరులోని ఐసీఎఫ్‌లో ప్రపంచ దేశాలతో పోటీ పడేలా ఎల్‌హెచ్‌పీ రైలు బోగీలు, వందే భారత్, విద్యుత్ రైలు బోగీల తయారీలో దూసుకెళ్తోంది. ఈ నేపథ్యంలో దేశంలోనే మొదటి సారిగా సబర్బన్ ఏసీ విద్యుత్ రైలును డిజైన్ చేసి సరి కొత్త రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా ఐసీఎఫ్ అధికారులు మీడియాతో మాట్లాడుతూ.. పూర్తిగా ఏసీ బోగీలతో కూడిన సబర్బన్ రైలును ఈ ఆర్థిక సంవత్సరంలో దక్షిణ రైల్వే శాఖకు ఇచ్చే విధంగా ఒప్పందం జరిగిందని, రైలు తయారై ప్రస్తుతం ట్రయల్ రన్ చేపడుతున్నట్లు తెలిపారు. రైల్వే బోర్డు నుంచి అనుమతి వచ్చినతరువాత ఏ మార్గంలో నడపాలన్నదానిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. అదే విధంగా చెన్నై రైల్వే డివిజన్‌కు ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఒక ఏసీ సబర్బన్ విద్యుత్ రైలు అందించేలా తయారు చేస్తున్నట్టు అధికారులు వివరించారు.

వందమందికి ఉచిత హృద్రోగ శస్త్రచికిత్సలు



ఉచిత చికిత్స పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

- ఐశ్వర్య హాస్పిటల్

చెన్నై, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓల్డ్ మహాబలిపురం రోడ్డు (ఓఎంఆర్)లో 400 పడకలతో ఐశ్వర్య సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రారంభమైంది. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ఆదివారం దీనిని ప్రారంభించగా, ఆస్పత్రి ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని వందమందికి ఉచితంగా హృద్రోహ శస్త్రచికిత్సలు చేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. దీనికి సంబంధించిన ప్రత్యేక పథకాన్ని దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్ బాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నటుడు శివకుమార్, ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ కె.వేలుస్వామి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ ముత్తువేల్ తదితరులు పాల్గొన్నారు.